సాక్షి
జగిత్యాల
శుక్రవారం । 5 । మే । 2023



నృసింహుని జయంతోత్సవం

ధర్మపురి: నవరాత్రోత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో గురువారం నృసింహుని జయంతోత్సవాలు వైభవంగా నిర్వహించారు.



రాజన్నకు సెలవుల రద్దీ

వేములవాడ: రాజన్నను గురువారం 15 వేల మంది దర్శించుకున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో భక్తులు కుటుంబ సభ్యులతో వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
33.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

వెళ్లిన పదిరోజులకే..

- తొలి ప్రయత్నంలోనే జాబ్ కొట్టిన అనిల్
- అందరితో కలివిడిగా ఉంటాడని పేరు
- అనిల్ మృతితో గ్రామంలో విషాదఛాయలు
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబం
- దీనంగా చూస్తున్న మృతుడి కుమారులు
- ఇంటికి భారీగా చేరుకున్న బంధువులు



భార్య సౌజన్య, పిల్లలతో అనిల్



మల్యాపూర్‌లోని అనిల్ ఇంటి వద్ద విషాదంలో బంధువులు

బోయినపల్లి(చొప్పదండి): జమ్ముకాశ్మీర్‌లోని ఓ నదిలో హెలికాప్టర్ కూలిపోయి మండలంలోని మల్కాపూర్‌కు చెందిన ఆర్మీ జవాన్ పబ్బాల అనిల్ (29) మృతిచెందాడన్న విషయం మండలంలో దావనంలా వ్యాపించింది. నిరుపేద కుటుంబానికి చెందిన పబ్బాల మల్లయ్య, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. అనిల్ పదో తరగతి గంగాధర ప్రైవేటు పాఠశాలలో.. ఇంటర్ కరీంనగర్‌లో పూర్తి చేశాడు. డిగ్రీ వరకు చదువుకున్న అనిల్ సుమారు 11 ఏళ్ల క్రితం ఆర్మీ రిక్రూట్‌మెంట్‌లో పాల్గొని తొలి ప్రయత్నంలోనే జాబ్ సాధించాడు. ఆయన ప్రస్తుతం జమ్మూకాశ్మీర్‌లో ఆర్మీ సీఎఫ్ఎస్ విభాగంలో ఏవీఎస్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. ఉద్యోగంలో చేరిన రెండేళ్లకు కోరెం గ్రామానికి చెందిన సౌజన్యతో వివాహమైంది. వారికి ఇద్దరు కుమారులు అయాన్ (6), అరయ్ (3) సంతానం. తన అత్తగారి ఊరైన కోరెంలో ఇటీవల బీరప్ప పట్నాలు వేసుకోగా.. ఆ కార్యక్రమానికి అనిల్ హాజరయ్యాడు. అందరితో కలిసి సుమారు పది రోజుల పాటు ఆనందంగా గడిపాడు.

కుమారుడికి పుట్టిన రోజు వేడుకలు

40 రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన అనిల్.. ఇటీవలే చిన్న కుమారుడు అరయ్ మూడో పుట్టినరోజును ఘనంగా నిర్వహించాడు. తండ్రి మల్లయ్య అనారోగ్యంతో బాధపడుతుంటే ఆసుపత్రిలో చూపించాడు. పదిరోజుల క్రితం తిరిగి విధులకు బయల్దేరాడు. అంతలోనే అనుకోని ప్రమాదం జరిగి మృతిచెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. ఇదే ఘటనలో హెలికాప్టర్‌లో ఉన్న మరో ఇద్దరు కూడా మృతిచెందినట్లు సమాచారం. అనిల్‌కు ఇద్దరు సోదరులు (శ్రీనివాస్, మహేందర్) ఉన్నారు. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. తల్లి లక్ష్మి గతంలో గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. తండ్రి మల్లయ్య ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నాడు. అనిల్ మరణవార్త తెలుసుకున్న బంధువులు, స్నేహితులు ఆయన ఇంటికి భారీగా చేరుకున్నారు. తల్లి ఏడుస్తుంటే ఏమీ తెలియని ఆ చిన్నారులు బిక్కుబిక్కుమంటూ చూస్తుండడం పలువురిని కంటతడి పెట్టించింది.

ఆర్మీకి వెళ్లాలని అనిల్ కోరిక

అనిల్‌కంటే ముందు గ్రామానికి చెందిన మెట్ట కుమార్ మొదట ఆర్మీలో చేరాడు. మరోవ్యక్తి అకెన అనిల్ కూడా ఆర్మీలో చేరడంతో ఎలాగైనా ఆర్మీలో చేరాలని అనిల్ భావించాడు. అనిల్‌కు చిన్నప్పటి నుంచే సైనికుడిని కావాలనే కోరిక ఉండేదని ఆయన సోదరుడు శ్రీనివాస్ చెప్పాడు.

బాధిత కుటుంబానికి 'బండి', 'బోయినపల్లి' పరామర్శ

అనిల్ మృతిచెందిన విషయం తెలుసుకున్న కరీంనగర్ ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ ఫోన్‌లో మాట్లాడారు. అనిల్ కుటుంబసభ్యులను ఓదార్చారు. మృతుడి కుటుంబానికి అన్నివిధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంతిమసంస్కారాలకు ఏర్పాట్లు చూడాలని స్థానిక నాయకులకు సూచించారు. అలాగే అనిల్ మృతి పట్ల రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సంతాపం ప్రకటించారు.

న్యూస్‌రీల్

తడిసిన ధాన్యం ప్రత్యేకంగా తూకం వేయాలి



ధాన్యం పరిశీలిస్తున్న లక్ష్మీనారాయణ

మల్యాల(చొప్పదండి): నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న ధాన్యం వెంటనే తూకం వేయాలని, తడిసిన ధాన్యాన్ని ప్రత్యేకంగా తూకం వేసి మిల్లులకు పంపించాలని డీఆర్డీవో పీడీ లక్ష్మీనారాయణ ఐకేపీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని రామన్నపేట, ముత్యంపేట గ్రామాల్లో సెర్ప్ ఆధ్వర్యంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు వివరాలకు సంబంధించి రికార్డ్స్ తనిఖీ చేశారు. రైతుల వివరాలకు సంబంధించి ఓపీఎంఎస్‌లో నమోదు పూర్తిచేయాలన్నారు. తడిసిన ధాన్యాన్ని సైతం తూకం వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రాజయ్య, సీసీ గంగారాజం, శశికుమార్, వీఓఏలు పుష్పలత, సుమలత పాల్గొన్నారు.

సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్లు బిగిస్తే చర్యలు



సైలెన్సర్లను పరిశీలిస్తున్న సీఐ

జగిత్యాలక్రైం: వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు సైలెన్సర్లు బిగిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ రాంచందర్‌రావు అన్నారు. గురువారం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో సౌండ్ పొల్యూషన్ సైలెన్సలర్లు బిగించిన 35 వాహనాలను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు పొల్యూషన్, సౌండ్‌తో ఇబ్బందులు కలిగించేలా వాహనాలుంటే వాటిని సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా తమ ద్విచక్ర వాహనాలకు సైలెన్సలర్లు అమర్చి సౌండ్ పొల్యూషన్ సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై రాము పాల్గొన్నారు.

స్థలం కేటాయింపు అభినందనీయం



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

జగిత్యాలరూరల్: టీజీవో సంఘ భవనానికి స్థలం కేటాయించడం అభినందనీయమని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగుల సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం టీజీవో జిల్లా శాఖ సమావేశం స్థానిక ఇరిగేషన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం సీపీఎస్ విధానం రద్దు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో కార్యదర్శి మామిడి రమేశ్, సహ అధ్యక్షుడు కందుకూరి రవిబాబు, కోశాధికారి గణేశ్, సభ్యులు బద్దం రాజేందర్‌రెడ్డి, విజేందర్, ప్రవీణ్‌చంద్ర, మండలోజు కిరణ్, ప్రవీణ్, సలీం పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమ రద్దయ్యే వరకు ఉద్యమం



ఇథనాల్ పరిశ్రమ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న స్వామి

వెల్గటూర్(ధర్మపురి): ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంతో ప్రజలు రోగాల బారిన పడతారని, రద్దయ్యే వరకు ఆయా గ్రామస్తులకు అండగా ఉంటామని ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు గజ్జెల స్వామి అన్నారు. మండలంలోని స్తంభంపల్లి శివారులో నిర్మించనున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తులకు గురువారం సంఘీభావం తెలిపారు. పరిశ్రమ నిర్మాణం వల్ల గాలి, నీరు, భూగర్భ జలాలు, గోదావరి జలాలు కలుషితం అయి ప్రజలు వ్యాధుల బారినపడుతారని, ఎట్టి పరిస్థితుల్లో నిర్మించనివ్వకూడదని, రద్దయ్యే వరకు ఈ పోరాటంలో తోడుగా ఉంటామని గ్రామస్తులకు భరోసా ఇచ్చారు. వెంటనే పరిశ్రమ రద్దు చేసి, యువకులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొల్లి స్వామి, పాలకుర్తి రాజేశంగౌడ్, సంతోష్, అయితరవేని కొమురయ్య పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కల్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీచైర్‌పర్సన్

జగిత్యాలరూరల్: నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ రమణ, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మోతె టీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జగిత్యాల రూరల్ మండలానికి చెందిన 64 మంది ఆడబిడ్డలకు రూ.64 లక్షల విలువ గల కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు అన్ని రాష్ట్రాలు గర్వించేలా తెలంగాణను ముందుంచడం జరుగుతుందన్నారు. అన్ని రాష్ట్రాల ప్రజలు తెలంగాణ సంక్షేమ పథకాలపై దృష్టి పెట్టారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేశ్, తహసీల్దార్ నవీన్, సింగిల్ విండో చైర్మన్ సందీప్‌రావు, రైతుబంధు మండల కన్వీనర్ నక్కల రవీందర్‌రెడ్డి, నాయకులు బాల ముకుందం, నారాయణ, ప్రవీణ్, సత్తన్న, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

జేపీఎస్‌ల డిమాండ్లు నెరవేర్చాలి

మల్లాపూర్(కోరుట్ల) : జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాంబారి ప్రభాకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట జేపీఎస్‌ల సమ్మెకు బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌కుమార్, పూదరి అరుణ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జేపీఎస్‌లను వెంటనే రెగ్యులరైజ్ చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం సమ్మెకు బీజేపీ రాష్ట్ర నాయకుడు పూదరి నిషాంత్ కార్తీకేయ తరుపున పూదరి అరుణ రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, పందిరి నాగరాజు, గడ్డం నవీన్‌రెడ్డి, ఎర్ర లక్ష్మీ, ఎంపీటీసీ ఆరే రాజేందర్, స్వామి, నాగేశ్, వెంకటేశ్, జలపతి, వేణుగోపాల్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫర్ కోసం దరఖాస్తు చేసుకోవాలి

జగిత్యాల: సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నడుస్తున్న కేజీబీవీల్లో కాంట్రాక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న స్పెషల్ ఆఫీసర్లు పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, ఏఎన్ఎంలు, అకౌంటెంట్లు ప్రస్తుతం ఉన్న కేజీబీవీల నుంచి ఇతర కేజీబీవీలకు ట్రాన్స్‌ఫర్ కోరే వారు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. మార్పులు కోరుకునే అభ్యర్థులు సమగ్ర శిక్ష వెబ్‌సైట్ transfers. cdse. telangana.gov.in లో ఈనెల 6 నుంచి 9 వర కు దరఖాస్తు చేసుకోవచ్చని, సూచనలు, మార్గదర్శకాలు వెబ్‌సైట్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణంపై రభస



సమావేశంలో బుగ్గారం, ఇతర గ్రామాల నాయకుల వాగ్వాదం

- బుగ్గారంలోనే నిర్మించాలంటున్న గ్రామస్తులు
- ప్రధాన రహదారి అయితేనే అనుకూలం అంటున్న ప్రజాప్రతినిధులు
- ప్రత్యేక సమావేశంలో భిన్నాభిప్రాయాలు, నాయకుల వాగ్వాదం

బుగ్గారం(ధర్మపురి): నూతనంగా ఏర్పడ్డ బుగ్గారం మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ క్రమంలో బుగ్గారం శివారులోని గోపులాపూర్ రోడ్డులో ఎదురుబోర్ల ప్రాంతంలో గల ప్రభుత్వ స్థలాన్ని ఇటీవలే చదును చేయడానికి పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఎదురుబోర్ల స్థలం కార్యాలయాల నిర్మాణానికి అనుకూలం కాదని, బుగ్గారంలోనే బలిదేవరగుట్టబోరు ప్రాంతంలో 16.35 ఎకరాల స్థలంలో నిర్మిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందని ఆ గ్రామస్తులు పనులు నిలిపివేయించారు. ఈ క్రమంలో అందరి అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్దామని స్థానిక జెడ్పీటీసీ మండల కేంద్రంలో అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామపెద్దలతో గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

సమావేశంలో భిన్నాభిప్రాయాలు

మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో బుగ్గారం, శెకెల్ల, మద్దునూర్, గోపులాపూర్, యశ్వంతరావుపేట, గంగాపూర్, సిరికొండ, వెల్గొండ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ప్రధాన రహదారికి సమీపంలోనే కార్యాలయాలు నిర్మించాలని పేర్కొన్నారు. కాగా బుగ్గారం నాయకులు, గ్రామస్తులు మండల కేంద్రంలోని బలిదేవరగుట్టబోరు ప్రాంతంలోనే నిర్మించాలని కోరారు. మండల ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని.. తమ అభిప్రాయాలకు భిన్నంగా వెళ్తున్నారని బుగ్గారం నాయకులు ఆరోపిస్తూ సమావేశం నుంచి బయటకు వెళ్లారు. అనంతరం గ్రామాల పెద్దలు, ప్రజాప్రతినిధులతో జెడ్పీటీసీ రాజేందర్ మాట్లాడారు. రెండు రోజుల్లో ప్రధాన రహదారికి సమీపంలో స్థలాన్ని చూడాలని, లేకుంటే ఎదురుబోర్ల సమీపంలోనే కార్యాలయాల నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

బుగ్గారం నాయకుల నిరసన

తమ అభిప్రాయాలను గౌరవించడం లేదని ఆరోపిస్తూ సమావేశం నుంచి బయటకు వచ్చిన బుగ్గారం నాయకులు స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిరసన తెలిపారు. తమ ప్రజాప్రతినిధుల మనసు మారేలా చూడాలని అంబేద్కర్ విగ్రహానికి విన్నవించారు. మంత్రి ఈశ్వర్ చొరవతో ఏర్పడిన బుగ్గారం మండలాన్ని ఆయనే కాపాడాలన్నారు. తమ ప్రజాప్రతినిధులు తమకు తీరని అన్యాయం చేసేలా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు.

గ్రామశివారులోనే అనుకూలం



ప్రధాన రహదారిపై ఎదురుబోర్ల స్థలం లేదా ప్రధాన రహదారికి సమీపంలోని మరేదైనా స్థలంలో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తేనే ఇతర గ్రామాల ప్రజలకు అనుకూలంగా ఉంటుంది. అందరూ సహకరించి నిర్మాణాలు త్వరగా ప్రారంభించుటకు ముందుకురావాలి.

– కోల రాజు, సర్పంచ్, యశ్వంతరావుపేట

ఐకమత్యంతోనే అభివృద్ధి



ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ విషయంలో వివిధ గ్రామాల ప్రజలు, నాయకులు పట్టుదలకు పోకుండా ఐకమత్యంగా ఉండి పనులు త్వరగా ప్రారంభించుకోవాలి. అందరూ కలిసిమెలిసి ఉంటేనే మండలం అభివృద్ధి చెందుతుంది.

– గాదె తిరుపతి, సర్పంచ్, వెల్గొండ

అందరూ సహకరించాలి



ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి ప్రధాన రహదారి సమీపంలోని ఎదురుబోర్ల వద్ద స్థలం అందరికీ అనుకూలంగా ఉంటుంది. అందరూ సహకరించి పనులను ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేయాలి. బుగ్గారం గ్రామంలో కొందరికి మాత్రమే ఎదురుబోర్ల స్థలం విషయంలో వ్యతిరేకత ఉంది. గ్రామస్తులంతా అనుకూలంగానే ఉన్నారు.

– మూల శ్రీనివాస్‌గౌడ్, నాయకుడు, బుగ్గారం

క్లుప్తంగా

పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలు


గాయపడిన బాలుడు

జగిత్యాల క్రైం: పిచ్చికుక్క దాడిలో ఓ బాలుడికి గాయాలయ్యాయి. పట్టణ శివారులోని టీఆర్‌నగర్‌కు చెందిన చరణ్ బుధవారం సాయంత్రం ఇంటివద్ద ఆడుకుంటుండగా వీధికుక్కలు దాడిచేశాయి. దీంతో చరణ్‌కు గాయాలుకాగా జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందించారు. గురువారం బాలుడికి నొప్పి తీవ్రం కావడంతో చికిత్స నిమిత్తం మళ్లీ ఆస్పత్రికి తరలించారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలి


నగేశ్

వెల్గటూర్ : అకాలవర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని వైఎస్సార్ టీపీ అధికార ప్రతినిధి డా.నగేశ్ డిమాండ్ చేశారు. వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొట్టుకుపోయిందని, నష్టపోయిన రైతులందరికీ రూ.10వేలు నష్ట పరిహారంగా అందించాలన్నారు. ధాన్యం తూకం వేయడంలో జాప్యం చేస్తుండటంతో రైతులు దళారులు, ప్రైవేటు వ్యాపారులకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు.

8న ఏఈఈ పరీక్ష

జగిత్యాల: కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పద్ధతిలో ఈనెల 8న కొండగట్టు జేఎన్‌టీయూలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్ష నిర్వహించనున్నట్లు కలెక్టర్ యాస్మిన్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, 2.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పరీక్ష జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఉదయం 9.30 గంటలకు, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 2 గంటల వరకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య


మల్లవ్వ మృతదేహం

గొల్లపల్లి: మండలంలోని గోవిందుపల్లి గ్రామానికి చెందిన గుర్రం మల్లవ్వ (65) బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మల్లవ్వ కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చేర్పించినా నయం కాలేదు. జీవితంపై విరక్తి చెంది గురువారం గ్రామంలో వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గాలించగా బావిలో మృతదేహం కనిపించింది. మృతురాలి భర్త హన్మాండ్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుళ్లిన శరీర భాగం లభ్యం


రైల్వే ట్రాక్ సమీపంలో కుళ్లిన శరీర భాగం

మల్యాల: మండలంలోని ముత్యంపేట శివారు దిగువ కొండగట్టు వద్ద రైల్వే ట్రాక్ సమీపంలో కుళ్లిన శరీరం భాగం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. మంచిర్యాల రైల్వే పోలీసులకు సమాచారం అందించగా రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. శరీర భాగంపై బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఎవరికైనా సమాచారం తెలిస్తే 9490871784, 9949304574 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

వ్యాన్ బోల్తా..


బోల్తాపడిన వ్యాన్

గొల్లపల్లి : ధాన్యం లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ బోల్తాపడింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని చెందోళి పీఏసీఎస్ పరిధిలోని చిల్వకోడూర్ కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ గురువారం దట్నూర్ బస్టాండ్ సమీపంలో మూల మలుపు వద్ద అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న ధాన్యం బస్తాలు రోడ్డు పక్కనే ఉన్న కాలువలో పడిపోయాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ అనిల్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పీఏసీఎస్ చైర్మన్ వెంకట మాధవరావు ఘటనా స్థలానికి చేరుకొని ధాన్యం బస్తాలను మరో లారీలో తరలించినట్లు తెలిపారు.

15 నుంచి పల్లెల్లో క్రీడా పండుగ

- చీఫ్ మినిస్టర్స్ కప్–2023 పేరిట పోటీలు
- మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు..
- నిర్వహణకు నిధులు, కమిటీలు
- 15 నుంచి 36 ఏళ్ల వయసువారు అర్హులు


మల్యాపూర్‌లో జరిగిన కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు (ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్: చాలా ఏళ్ల తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా సంబరం నెలకొననుంది. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం చీఫ్ మినిస్టర్స్ కప్–2023 పేరిట క్రీడా పండుగకు శ్రీకారం చుట్టారు. పోటీల నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవలే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ సంబంధిత ఫైలుపై తొలి సంతకం చేశారు. అనంతరం పోటీల నోటిఫికేషన్ విడుదలైంది. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో క్రీడలు సజావుగా సాగేందుకు కమిటీలను వేసి, నిధులు సైతం విడుదల చేశారు. 15 నుంచి 36 ఏళ్ల వయసువారు అర్హులు.

మండల స్థాయిలో 5 క్రీడాంశాలు..

మండల స్థాయిలో జరిగే పోటీలకు ఎంపీపీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఎంపీడీవో మెంబర్ కన్వీనర్‌గా, జెడ్పీటీసీ, తహసీల్దార్, ఎంఈవో లేదా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఎస్సై, మున్సిపల్ కమిషనర్, పీడీ లేదా పీఈటీలు సభ్యులుగా వ్యవహరిస్తారు. పోటీల నిర్వహణకుగాను రూ.15 వేలు మంజూరు చేశారు. 5 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పురుషులకు ఫుట్‌బాల్ పోటీలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు జరగనున్నాయి.

జిల్లా స్థాయిలో 11..

జిల్లా స్థాయిలో జరిగే పోటీలకు చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఐపీఎస్ అధికారి, కో–వైస్ చైర్మన్‌గా అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీ), కన్వీనర్‌గా జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి, సభ్యులుగా ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, డీఈవో, ఇండస్ట్రీస్ జీఎం, మున్సిపల్ కమిషనర్ వ్యవహరిస్తారు. పోటీల నిర్వహణకు రూ.75 వేలు మంజూరయ్యాయి. 11 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్‌తో పాటు పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్ పోటీలు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరగనున్నాయి.

రాష్ట్ర స్థాయిలో 18..

రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాశాఖ మంత్రి చైర్మన్‌గా, శాట్స్ చైర్మన్ కో–చైర్మన్‌గా, ప్రిన్సిపల్ సెక్రటరీ వైస్ చైర్మన్‌గా, శాట్స్ ఎండీ కన్వీనర్‌గా, తెలంగాణ ఒలింపిక్ సంఘం అధ్యక్షులు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్, కమిషనర్ మున్సిపల్, కమిషనర్ పంచాయతీరాజ్, కమిషనర్ జీహెచ్ఎంసీ, డిప్యూటీ డైరెక్టర్లు సభ్యులుగా వ్యవహరిస్తారు. 18 క్రీడాంశాల్లో పురుషులు, మహిళలకు అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, ఆర్చరీ, జిమ్నాస్టిక్స్, లాన్ టెన్నిస్, షూటింగ్, టేబుల్‌టెన్నిస్‌తోపాటు పురుషులకు ఫుట్‌బాల్, బాక్సింగ్, రెజ్లింగ్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు జరగనున్నాయి.

నగదు బహుమతి..

రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన వారికి నగదు బహుమతి ఇవ్వనున్నారు. వ్యక్తిగత విభాగంలో మొదటి స్థానానికి రూ.20 వేలు, ద్వితీయ స్థానానికి రూ.15 వేలు, తృతీయ స్థానానికి రూ.10 వేలు ఇస్తారు. టీం విభాగంలో మొదటి స్థానానికి రూ.లక్ష, ద్వితీయ స్థానానికి రూ.75 వేలు, తృతీయ స్థానానికి రూ.50 వేలు ఇవ్వనున్నారు.

గ్రామీణ క్రీడాకారులకు వరం



సీఎం కప్ క్రీడా పోటీలు గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు వరం. రాష్ట్ర మంత్రి, జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మండల, జిల్లా స్థాయిలో క్రీడలను పకడ్బందీగా నిర్వహిస్తాం. ఇక్కడ రాణించిన క్రీడాకారులకు భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయి.

– కీర్తి రాజవీరు, డీవైఎస్‌వో, కరీంనగర్, చీఫ్ మినిస్టర్స్ కప్ కన్వీనర్

యువత సద్వినియోగం చేసుకోవాలి



పల్లె క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉంది. వేసవి సెలవుల్లో క్రీడా సందడి మొదలుకానుంది. యువత ఈ పోటీలను సద్వినియోగం చేసుకోవాలి.

– నందెల్లి మహిపాల్, ఒలింపిక్ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు, కప్ నిర్వాహక సభ్యుడు

విజయదుందుభి మోగించాలి



చాలా రోజుల తర్వాత గ్రామీణ స్థాయి నుంచి జరుగుతున్న క్రీడా పోటీలతో పల్లెల్లో క్రీడా పండుగ వాతావరణం నెలకొననుంది. క్రీడాకారులు మండల, జిల్లా స్థాయి పోటీలను సద్వినియోగం చేసుకోవాలి. రాష్ట్రస్థాయిలో విజయదుందుభి మోగించాలి.

– గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఒలింపిక్ సంఘం కరీంనగర్ జిల్లా కార్యదర్శి,కప్ నిర్వాహక సభ్యుడు

ముగిసిన అంత్యక్రియలు


అభిషేక్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మేడిపెల్లి : కొడిమ్యాల మండలం.. కోనాపూర్ గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందగా గురువారం అంత్యక్రియలను స్వగ్రామాల్లో నిర్వహించారు. బీమారం మండల కేంద్రానికి చెందిన మోహిన్ ఖాన్ తండ్రి మహమూద్ చిరువ్యాపారి కాగా కుమారుడు, కుమార్తె ఉన్నారు. డిగ్రీ చదువుతున్న ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. రాగోజీపేటకు చెందిన మల్లయ్య కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్ మధ్యలోనే మానేసిన కుమారుడు గోకుల అభిషేక్ చేదోడువాదోడుగా ఉంటాడుకున్న తరుణంలో ప్రమాదంలో మృతిచెందడం ఆ కుటుంబంలో విషాదం నింపింది. మేడిపెల్లికి చెందిన బొంగోని వరుణ్ సందేశ్ ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాశారు. తండ్రి ఉపాధికోసం గల్ఫ్‌కు వెళ్లి ఇటీవలే తిరిగివచ్చాడు. వరుణ్ మృతి ఆ కుటుంబంలో తీరని లోటు మిగిల్చింది.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మల్లాపూర్ : అకాలవర్షాలతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని టీడీపీ జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ మానుక ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని రాఘవపేట, ముత్యంపేట గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా 30వేల ఎకరాల్లో మామిడిపంటలకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. టీడీపీ నాయకులు కట్టకొల వెంకటేశ్, ఎండీ.సాదుల్లా, రాజగణేశ్, మహదేవ్, మారుతి, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఒకేలా బీమా వర్తింపజేయాలి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

సారంగాపూర్ : రైతులు, గీత కార్మికులకు ఒకేలా బీమా వర్తింపజేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు సాధారణంగా మృతిచెందినా, ప్రమాదవశాత్తు మృతిచెందినా రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించిందని, గీత కార్మికులకు కేవలం వృత్తిలో ప్రమాదవశాత్తు మృతిచెందితే వర్తింపజేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాలో 2021–22, 2022–23 సంవత్సరాల్లో మృతిచెందిన గీత కార్మికులు, శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి రూ.1.12 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. సమావేశంలో ఎంపీపీ మసర్తి రమేశ్, వైస్ ఎంపీపీ కోండ్ర రాం చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ న్యారబోయిన గంగాధర్, నాయకులు ఆకుల రాజిరెడ్డి, వుదుమల్ల లక్ష్మారెడ్డి, కాలగిరి సత్యనారాయణ, కర్నె అంజన్న, కాలగిరి మధుసూదన్, తదితరులున్నారు.

గీత కార్మికులకు బీమా

- ప్రభుత్వ ప్రకటనతో జిల్లాలో 16,642 మందికి లబ్ధి


తాటిచెట్టు ఎక్కుతున్న గీత కార్మికుడు

జగిత్యాలరూరల్: రాష్ట్రంలోని గీత కార్మికులకు అండగా ఉండేందుకు ప్రభుత్వం బీమా పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. గీత కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల బీమా వచ్చేలా ప్రణాళిక రూపొందించారు. బాధిత కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉండేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కాగా జిల్లాలో గీత పారిశ్రామిక వృత్తిపై ఆధారపడ్డ ప్రతి ఒక్కరికి ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించేందుకు ఎక్సైజ్ ప్రొబేషనరీ శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

282 గీత పారిశ్రామిక సహకార సంఘాలు

జిల్లాలో 282 గీత పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. అలాగే టీఎఫ్‌టీ ఒక్కొక్కరికి ఒక్కో లైసెన్స్ ద్వారా 22 ఉన్నాయి. జిల్లాలో మొత్తం 306 కల్లు దుకాణాలు ఉండగా జిల్లా వ్యాప్తంగా 16,642 మంది గీత కార్మికులున్నారు. వీరందరికీ ప్రభుత్వం బీమా కల్పించనుంది. దీంతో ఎన్నో ఏళ్లుగా ప్రమాదవశాత్తు గీత కార్మికులు మరణిస్తే ప్రభుత్వం నుంచి రాయితీ రాక ఎన్నో కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఏదైనా ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ కుటుంబాన్ని ప్రభుత్వం నుంచి ఆదుకునేందుకు గీత కార్మికులకు బీమా సౌకర్యం కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

లబ్ధిదారుల గుర్తింపునకు చర్యలు..

ప్రభుత్వం గీత కార్మికులకు బీమా చేయించేందుకు నిర్ణయించడంతో జిల్లాలో గీత కార్మికవృత్తిపై ఆధారపడ్డ వారి వివరాలను జిల్లా ఎక్సైజ్ ప్రొబేషనరీ శాఖ అధికారులు సేకరిస్తున్నారు. దీంతో అర్హులైన వారి జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు.

కుటుంబానికి అండగా ఉంటుంది



ప్రభుత్వం గీత కార్మికులకు బీమా సౌకర్యం కల్పిస్తూ ఆదేశాలివ్వడం అభినందనీయం. చాలా మంది గీత కార్మికులు నిత్యం పనిచేస్తేగానీ పొట్టగడవని పరిస్థితుల్లో ఉన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే బీమా వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం మంచి పరిణామం.

– నక్క రాంచంద్రం, గీత కార్మికుడు, కన్నాపూర్

ఆనందంగా ఉంది



చాలా ఏళ్లుగా గీత కార్మికులు ఏదైనా ప్రమాదాల బారిన పడితే ఆదుకునే వారే కరువయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం కోసం గీత కార్మికులు ఏదైనా ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల బీమా వచ్చేలా చర్యలు చేపట్టడం ఎన్నో కుటుంబాలకు అండగా ఉంటుంది.

– కట్ట శ్రీనివాస్‌గౌడ్, గీత కార్మికుడు, కిష్టంపేట

అర్హుల నివేదిక సమర్పిస్తాం



జిల్లాలోని గీత పారిశ్రామిక సంఘాల్లో సభ్యులైన గీత కార్మికుల్లో అర్హులైన వారిని గుర్తించి జాబితా సిద్ధం చేస్తాం. అనంతరం ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తాం.

– శ్రీధర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్

కుట్టుశిక్షణతో ఉపాధి పొందాలి

జ్యోతినగర్(రామగుండం): ఉచిత కుట్టుశిక్షణతో మహిళలు మహిళలు ఉపాధి పొందాలని డిస్ట్రిక్ట్ మిషన్ కో–ఆర్డినేటర్ రజని అన్నారు. రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ అన్నపూర్ణకాలనీ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. మహిళలు తమ ఖాళీ సమయాన్ని వృథా చేసుకోకుండా స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొంది, ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కుట్టుశిక్షణ పొందుతున్న మహిళలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో శ్వేత, శ్యాం, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు కోత తిప్పలు...

- ఇటీవల కురిసిన వర్షాలకు పొలంలో దిగబడుతున్న హార్వెస్టర్లు
- తడిసి మోపడవుతున్న ఖర్చులు
- ఆందోళనలో అన్నదాతలు


వరిపొలంలో దిగబడిన హార్వెస్టర్

జగిత్యాల అగ్రికల్చర్ : జిల్లాలో ఇటీవల కురుస్తున్న అకాలవర్షాలతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. యాసంగిలో అంతంతమాత్రమే దిగుబడి వస్తుండగా పంట కోయించడం నుంచి ధాన్యం విక్రయించేవరకు అధిక ఖర్చులతో సతమతమవుతున్నారు. వేలు ఖర్చుపెట్టి పంటలను హార్వెస్టర్లతో కోయించే పరిస్థితి నెలకొంది. అయినా ధాన్యం నేల రాలి చేతికందే పరిస్థితి లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

3.05 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో దాదాపు 3.05 లక్షల ఎకరాల్లో రైతులు యాసంగిలో పంటలు సాగుచేశారు. అకాలవర్షాలతో పండిన పంటను కోయించలేక రైతులు దిక్కులు చూస్తున్నారు. చెరువులు, కుంటలనిండా నీరు ఉండగా సమీపంలోని భూముల్లో తేమ ఉండడంతో వర్షం పడితే 15–20 రోజుల వరకు హార్వెస్టర్ నడవడం కూడా కష్టంగా మారుతోంది. పంటను కోసేందుకు వస్తే హార్వెస్టర్లు దిగబడుతున్నాయి. దీంతో యజమానులు అటువైపు తొంగిచూడటం లేదు.

అధిక ఖర్చులతో సతమతం..

పొలాల్లో తేమ లేకపోతే హార్వెస్టర్లతో సులభంగా పంటను కోయవచ్చు. గంటకు రూ 2,300 వరకు చెల్లించి ఎకరం పొలాన్ని గంటలోనే కోసే అవకాశం ఉండేది. ఇప్పుడు అకాలవర్షాలకు నీరు నిలిచి పొలంలో దిగబడుతుండటంతో చైన్ హార్వెస్టర్ల అవసరం ఏర్పడింది. దీంతో గంటకు రూ.3 వేల నుంచి రూ.3,500 చెల్లించి పంటలు కోయించే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులకు ఖర్చు రెండు, మూడింతలు ఎక్కువవుతోంది.

ధాన్యం తరలించడమూ కష్టమే..

ఏదోలాగా పంటను కోయించినా ధాన్యాన్ని గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి తరలించడం రైతులకు ఇబ్బందిగా మారింది. సాధారణంగా టైర్ హార్వెస్టర్ కోస్తే అక్కడికే ట్రాక్టర్ వెళితే కోసిన ధాన్యాన్ని ట్రాక్టర్ డబ్బాలో పోస్తారు. కానీ దిగబడుతున్న పొలాల్లోకి వెళితే ట్రాక్టర్ సైతం దిగబడే పరిస్థితి ఉంది. దీంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించడం రైతులకు ఇబ్బందిగా మారుతోంది.

పొలం ఆరుతుందని చూస్తున్నా



నేను మూడు ఎకరాల్లో సాగుచేసిన పంట కోతకు వచ్చింది. ఇటీవల అకాలవర్షాలు కురవడంతో భూమిలో తేమశాతం ఎక్కువగా ఉంది. హార్వెస్టర్‌తో పంట కోసే పరిస్థితి లేదు. దీంతో, పొలం ఆరుతుందని ఎదురు చూస్తున్నా.

– ఏలేటి స్వామిరెడ్డి, శ్రీ రాములపల్లె, గొల్లపల్లి మండలం

పంట నేలవాలుతోంది



నేను నాలుగెకరాల్లో వరి సాగుచేశాను. పంటను కోయిస్తా అనుకున్నా పొలంలో హార్వెస్టర్ దిగబడుతుంది. భూమిలో తేమ ఆరేవరకు ఆగుదామనుకుంటే ఈదురుగాలులకు పంట నేలవాలుతోంది. ఏమి చేయాలో అర్థం కావడం లేదు.

– గణపతి, దొంతాపూర్, ధర్మపురి

అమ్మానాన్న మాట్లాడటం లేదని..

- మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య


అన్నపూర్ణ (ఫైల్)

రామగుండం: అమ్మానాన్న తనతో మాట్లాడటం లేదని మనస్తాపం చెందిన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. రామగుండం ఎస్సై శరణ్య తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాలపల్లికి చెందిన బందారపు శ్రీనివాస్–అన్నపూర్ణ(43) దంపతుల కూతురు వివాహం ఏడాది క్రితం జరిగింది. పెళ్లిలో అన్నపూర్ణ అత్తింటివారికి, తల్లిగారింటివారికి గొడవ జరిగింది. అప్పటినుంచి అన్నపూర్ణ తల్లిదండ్రులు ఆమెతో మాట్లాడటం మానేశారు. ఈ విషయంలో ఆమె తీవ్ర మనోవేదనకు గురవుతోంది. ఈ క్రమంలో వారం రోజుల క్రితం అన్నపూర్ణ కూతురుకు బాబు జన్మించగా భర్త తరఫు బంధువులు వచ్చారు. తల్లిగారింటి నుంచి ఎవరూ రాకపోగా కనీసం ఫోన్‌లోనూ మాట్లాడలేదు. దీంతో మనస్తాపం చెందిన అన్నపూర్ణ బుధవారం అర్ధరాత్రి ఇంటి పక్కనే ఉన్న బావిలో దూకి, ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రామగుండం వాసి మృతదేహం లభ్యం


వెంకటేశ్వర్లు (ఫైల్)

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్ బస్టాండ్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గురువారం ఓ వ్యక్తి మృతదేహం లభించింది. బసంత్‌నగర్ ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే బ్రిడ్జి వద్ద కుళ్లిన మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు దాదాపు 15 రోజుల క్రితమే మరణించినట్లుగా ఉందని, అక్కడ లభించిన ఆధారాలనుబట్టి రామగుండంకు చెందిన బండి వెంకటేశ్వర్లుగా గుర్తించినట్లు ఎస్సై తెలిపారు. వెంకటేశ్వర్లు కొన్నేళ్లుగా భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని, ఎండదెబ్బ కారణంగా చనిపోయి ఉంటాడని పేర్కొన్నారు. పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుని సంబంధీకులు ఎవరైనా ఉంటే బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

తిమ్మాపూర్(మానకొండూర్): మండలంలోని ఇందిరానగర్ వద్ద రాజీవ్ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న గంట పవన్‌కుమార్ అతివేగంగా వాహనం నడిపి ద్విచక్రవాహనంపై వెళ్తున్న కరీంనగర్ ముకరంపురకు చెందిన మీర్జా హఫీజ్ అలీ బేగ్ (56)ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఏఎస్సై నజీమొద్దీన్ తెలిపారు.